నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 25 మే 2024 | BHADRADRI KOTHAGUDEM


ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని పట్టభద్రులకు పరిచయం చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- కాంగ్రెస్, బీజేపీలది రాజకీయ అనుబంధం
- గోల్డ్‌మెడలిస్ట్‌ను పెద్దల సభకు పంపండి
- బ్లాక్‌మెయిలర్‌ను ఇంటికి పంపండి
- సత్తుపల్లి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

తెలంగాణతో కేసీఆర్‌ది పేగుబంధం

సత్తుపల్లి టౌన్, మే 24 : తెలంగాణతో ఉద్యమ నేత కేసీఆర్‌ది పేగుబంధమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. కానీ ఇదే తెలంగాణతో కాంగ్రెస్, బీజేపీ నేతలది రాజకీయ బంధమని విమర్శించారు. తెలంగాణ ఉనికి కోసం ఎవరు ఎంతటి పోరాటం చేశారో, ప్రాణాలు పణంగా పెట్టి ఉద్యమించారో ఇక్కడి ప్రజలందరికీ తెలుసునని అన్నారు. అందుకని ఉద్యమసారథి దీవించి పంపిన రాకేశ్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అదే సమయంలో అమూల్యమైన ఓటుతో బ్లాక్‌మెయిలర్ అయిన కాంగ్రెస్ అభ్యర్థిని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఖమ్మం – వరంగల్ – నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సత్తుపల్లి సిద్ధారంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గ్రాడ్యుయేట్ల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు అమెరికాలో ఉన్నతోద్యోగం వదులుకొని వచ్చిన గోల్డ్‌మెడలిస్టు రాకేశ్‌రెడ్డికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు వేసి అధిక మెజార్టీ అందించాలని పిలుపునిచ్చారు. అతడిని పెద్దల సభకు పంపడం ద్వారానే పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. అయితే బ్లాక్ మెయిలర్, చీటర్ అయిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విషయంలో పట్టభద్రులు ఆలోచించాలని కోరారు. అలాంటి వ్యక్తి పెద్దల సభకు వెళ్లడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.

కొట్లాడి సాధించిన తెలంగాణను ముఖ్యమంత్రిగా ఉద్యమనేత కేసీఆర్ ఈ పదేళ్లలో అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తుచేశారు. కానీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన ఈ కాంగ్రెస్ పాలకులు ఆరు నెలల్లోనే అధోగతిపాలు చేశారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు గ్యారెంటీలంటూ గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ గ్యారెంటీల ఊసునే మర్చిపోయారని దుయ్యబట్టారు. మహాలక్ష్మి, రైతుభరోసా, పింఛన్లు, పేదలకు ఇళ్లు వంటి ఏ హామీనీ నెరవేర్చలేదని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఎందుకివ్వలేదో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చివరికి నిరుద్యోగ భృతి ఇస్తామంటూ నమ్మించిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆఖరికి దానిని కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందని దుమ్మెత్తిపోశారు. పెండింగ్ డీఏలు అడిగిన ఉపాధ్యాయులపై లారీచార్జీ చేయించారని అన్నారు. ధాన్యానికి బోనస్ పేరుతో అన్నదాతలనూ దగా చేశారని దుయ్యబట్టారు. ఇలాంటి మోసపూరిత కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

మీకోసం పోరాడేందుకు ఓటడుగుతున్నా: అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

తాను అధికారం కోసం ఓటు అడగడం లేదు, మీ కోసం పోరాడేందుకే ఓటు అడుగుతున్నాను. గతంలో పార్టీలతో సంబంధం లేకుండా మంచి వ్యక్తులను ఎన్నుకున్న ఇక్కడి పట్టభద్రులు.. ఈ ఎన్నికల్లోనూ అదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. మోసగాళ్ల మాయమాటలను గమనించాలని కోరారు. తనను గెలిపిస్తే నిరుద్యోగులు, పట్టభద్రుల పక్షాన ప్రభుత్వంపై పోరాడుతానని అన్నారు.

తీన్మార్ మల్లన్న గెలిస్తే పిక్‌పాకెట్ గాళ్లను తెస్తాడు: ఆర్ఎస్‌పీ

రైతు కుటుంబంలో పుట్టి బిట్స్‌పిలానీలో చదువుకుని గోల్డ్‌మెడల్ సాధించిన రాకేశ్‌రెడ్డి గెలిస్తే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు తెస్తారు. కానీ బ్లాక్‌మెయిలర్ అయిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే పిక్‌పాకెట్ గాళ్లను తీసుకొస్తాడని విమర్శించారు. యూట్యూబ్‌ను అడ్డుపెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేసినందుకు గాను.. ఇదే తీన్మార్ మల్లన్నపై అనేక కేసులు నమోదయ్యాయని, 72 రోజులపాటు జైల్లో కూడా ఉన్నాడని గుర్తుచేశారు.

విద్యావంతుడికి, బ్లాక్‌మెయిలర్‌కి మధ్య పోటీ: ఎంపీ నామా

విద్యావంతుడికి, బ్లాక్‌మెయిలర్‌కు మధ్య జరుగుతున్న ఈ పట్టభద్రుల ఎన్నికల్లో పట్టభద్రులందరూ విద్యావంతుడివైపే నిలవాలని కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల గుణగణాలు ఏంటో పట్టభద్రులు గమనించాలని కోరారు. రాకేశ్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేశ్, దొడ్డా హైమావతి తదితరులు పాల్గొన్నారు.


బోనకల్ : సమావేశానికి హాజరైన పట్టభద్రులు, నాయకులు

రాకేశ్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ తథ్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, పక్కన ఆర్ఎస్‌పీ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర

బోనకల్లు సమ్మేళనంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

బోనకల్లు, మే 24: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ ఆరు నెలల్లో అబద్ధాల ఆరు గ్యారెంటీలను గమనించిన రాష్ట్ర ప్రజలు 'వద్దురా నాయనా.. మాకు ఈ కాంగ్రెస్ పాలన' అంటున్నారని అన్నారు. ప్రజల ఆలోచనలు, వారి మాటలే బీఆర్ఎస్ అభ్యర్థి విజయాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ఉమ్మడి ఖమ్మం – నల్గొండ – వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అధ్యక్షతన బోనకల్లులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుచుకుంటూ వస్తున్నారని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో కూడా ఇదే పునరావృతమవుతుందని స్పష్టం చేశారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పని అయిపోయిందని అన్నారు. ఇప్పటికీ ఈ ప్రభుత్వం ప్రజలను వంచిస్తూనే పాలన చేస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సే కాదని.. మిగిలిన అన్ని హామీలూ బుస్సే అయ్యాయని విమర్శించారు. రూ.15 వేల రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగ భృతి, మహిళలకు రూ.2500, ఆడపిల్లలకు కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వాటిల్లో ఏ ఒక్కదానినీ అమలుచేయకుండా ప్రజలను మోసిందని దుయ్యబట్టారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం 24 గంటలూ విద్యుత్ సరఫరా చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దానిని 14 గంటలు చేసిందని తూర్పారబట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7 మండలాలను ఆంధ్రాలో కలిపిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు.. హైదరాబాద్‌ను మరో పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మధిర ప్రాంతానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే లేనప్పటికీ.. ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తాడని అన్నారు.

బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు కొండబాల కోటేశ్వరరావు, పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, బిచ్చాల తిరుమలరావు, మొండితోక జయాకర్, బంధం శ్రీనివాసరావు, బానోతు కొండా, బొమ్మెర రామ్మూర్తి, చేబ్రోలు మల్లికార్జునరావు, రావూరి శ్రీనివాసరావు, వాచేపల్లి లక్ష్మారెడ్డి, కనుమూరి వెంకటేశ్వరరావు, పంబి సాంబశివరావు, పెంట్యాల పుల్లయ్య, మోదుగుల నాగేశ్వరరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, బొడ్డు వెంకటరామారావు, అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, శీలం కవిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బాండ్లు బౌన్స్ అయ్యాయి

ఖమ్మం రూరల్ సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు

ఖమ్మం రూరల్, మే 24: ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బాండ్లు అధికారంలోకి వచ్చిన తరువాత బౌన్స్ అయ్యాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. చివరికి 'వరికి బోనస్' అంటూ చెప్పిన మాటలు బోగస్ అయ్యాయని దుయ్యబట్టారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం రూరల్ మండలం బారుగూడెంలో బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి తాళ్లూరి జీవన్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం రాత్రి నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం అనేక హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిల్లో ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు, రైతుల నుంచి నిరుద్యోగుల వరకు ప్రతి ఒక్కరినీ వంచించిందని అన్నారు. పైగా ప్రశ్నించిన ప్రతి ఒక్కరిని కేసుల పేరుతో భయపెడుతోందని ఆరోపించారు. చివరికి రైతులను కూడా కించపరిచే విధంగా మంత్రులు మాట్లాడుతుండడాన్ని యావత్ తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అధికారం తలకు ఎక్కిన మాటలు దిగిరావాలంటే ఈ పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఉప్పల వెంకటరమణ, మరికంటి ధనలక్ష్మి, బెల్లం ఉమ, బెల్లం వేణుగోపాల్, యండపల్లి వరప్రసాద్, ఉన్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య, బాషబోయిన వీరన్న, ఇంటూరి శేఖర్, బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హాజరైన పట్టభద్రులు, పార్టీ నాయకులు

కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు తెచ్చింది

మిట్టపల్లిలో మాజీ మంత్రి హరీశ్‌రావు వద్ద గోడు వెళ్లబోసుకున్న కర్షకులు

తమ పక్షాన అసెంబ్లీలో పోరాడితే తామంతా కదిలివస్తామన్న అన్నదాతలు

హామీలపై అసెంబ్లీలో, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న హరీశ్

పెనుబల్లి, మే 24 : 'మాయదారి కాంగ్రెస్ వచ్చి మా అందరికీ కష్టాలు తెచ్చిపెట్టింది' అంటూ కర్షకులు ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇన్నాళ్లూ కర్షకులను కంటికి రెప్పలా కాపాడుకున్నారని, అన్నదాతల కోసం ఆయన అహర్నిశలూ శ్రమించారని గుర్తుచేశారు. ఇప్పుడొచ్చిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వంతో తమలాంటి అన్నదాతలందరూ అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో శుక్రవారం జరిగిన పట్టభద్రుల సమావేశానికి హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు.. అనంతరం ఖమ్మానికి తిరుగు ప్రయాణమై వస్తున్నారు. ఈ క్రమంలో తల్లాడ మండలం మిట్టపల్లి శివారున అదే గ్రామానికి చెందిన రైతులు కల్యాణపు చిన్నసత్యం, కల్యాణపు కృష్ణయ్య, రామిశెట్టిపల్లి లక్ష్మణరావు సహా మరికొంతమంది రైతులు కలిసి మాజీ మంత్రి వాహనాన్ని ఆపారు. వారిని గమనించి వాహనం దిగిన హరీశ్‌రావు.. 'ఏం పెద్దాయన.. బాగున్నారా.. వ్యవసాయం ఎలా ఉన్నది.. ఇప్పుడు పరిస్థితి ఎట్లా ఉన్నది?' అంటూ పలుకరిస్తూ వారితో కలిసి వారి పొలాల్లోకి వెళ్లారు. 'ఏం చెప్పమంటారు సారు.. మా బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.' అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు తమ బాధలన్నింటినీ హరీశ్‌రావు ఎదుట వెళ్లబోసుకున్నారు. 'సారూ.. మా రైతుల పక్షాన అసెంబ్లీలో పోరాడండి. మేమంతా కదిలివచ్చి అసెంబ్లీని ముట్టడిస్తాం. అందరూ కలిసి ప్రభుత్వాన్ని నిలదీద్దాం.' అని అన్నారు. 'అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తానంటోంది. దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వనంటోంది. పంటలకు సాగునీళ్లు ఇవ్వలేదు. మోటరు వేసుకునేందుకు కరెంటూ ఇవ్వలేదు. ఆఖరికి పంటల పెట్టుబడికి రైతు భరోసా కూడా ఇవ్వలేదు.' అంటూ తమ గోడు వెళ్లబోసుకున్నారు.

ప్రభుత్వానికి పాలనపై సోయి లేదు: హరీశ్‌రావు

అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై సోయి లేకుండా పోయిందని విమర్శించారు. రైతుల ఆవేదనను ఆలకించిన ఆయన.. అక్కడి నుంచే తల్లాడ మండలం వ్యవసాయాధికారి తాజుద్దీన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. రైతులకు సకాలంలో విత్తనాలు అందించకపోతే ఎలా అని, ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. అనంతరం అక్కడికి వచ్చిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నదని ఆరోపించారు. రైతుల సాదకబాదకాలు తెలుసుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్డెక్కగానే ప్రభుత్వం స్పందించి హుటాహుటిన రైతుబంధు జమ చేసిందని, తాగునీటి కోసం సాగర్ జలాలు విడుదల చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుంటే ప్రతిరోజూ ప్రజల మధ్యనే ఉండి పోరాడుతామని, తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతుల కోసం ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అన్ని రకాల వడ్లకూ కచ్చితంగా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవే సమస్యలపై అన్నదాతల పక్షాన అసెంబ్లీలో కూడా పెద్ద ఎత్తున పోరాడుతామని తేల్చి చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఒక్కో హామీ గురించి ఒక్కో మంత్రి ఒక్కో విధంగా మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు.

వ్యవసాయాధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్

- రైతన్నల ఆశలను ఆవిరిచేస్తున్న రాష్ట్ర సర్కార్
- సన్నవడ్లనే పండించాలనడం.. అవగాహనా రాహిత్యమే
- ఆర్నెళ్లల్లోనే కాంగ్రెసోళ్లకు అహంకారం ఎక్కువైంది
- వానకాలం 'రైతుభరోసా' జూన్‌లోనే అందించాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

ఖమ్మం, మే 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అలవికాని హామీలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసగించి అధికారాన్ని చేజిక్కించుకున్నదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఖమ్మం–నల్గొండ–వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో విలేకరులతో హరీశ్‌రావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతుల కాళ్లు మొక్కి వందరోజుల్లో రుణమాఫీ, రైతు భరోసా రూ.7,500, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని నమ్మించి మోసగించిందన్నారు. వడ్లకు రూ.500 బోనస్ అడిగిన పాపానికి రైతులకు అవగాహన లేక మాట్లాడుతున్నారని సాక్షాత్తు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అనడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులను అవహేళన చేసే హక్కు మంత్రికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఆర్నెళ్లు ఐనా పాలనపై పట్టు సాధించలేక ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయిందన్నారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకూ రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు కేవలం సన్నవడ్లు పండించిన రైతులకేనంటూ మరోమారు మోసగిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభ్వుత్వంలో పూటకో మంత్రి.. రోజుకో తీరుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. సన్నరకాలను మాత్రమే పండించాలని మంత్రులు చెప్తున్న తీరు.. నోటితో మాట్లాడి.. నోసటితో వెక్కిరించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. సన్నాలను పండిస్తే పంటకు తెగులెక్కువ, దిగుబడి తక్కువగా వస్తుందన్నారు. అంతేకాక దొడ్డు వడ్లు 120రోజుల్లో దిగుబడి వస్తే.. సన్నవడ్లు 150రోజుల్లో పండుతాయన్నారు. రాష్ట్రంలోని 99శాతం మంది రైతులు దొడ్డు వడ్లను పండిస్తారని కేవలం ఒక్కశాతం మాత్రమే సన్నవడ్లను పండిస్తారని వివరించారు. ఇది కేవలం రైతులను అవమానపరచడమే అన్నారు. మంత్రులకు ఆర్నెళ్లకే అహంకారం పెరిగిపోయిందన్నారు. పాలనపై పట్టులేకపోవడంతో రైతులు ఇప్పటికే క్రాప్ హాలీడే ప్రకటించారని, వ్యవసాయానికి సరిపడా నీళ్లు అందించకపోవడంతో వేసిన పంటలన్నీ ఎండిపోయాయన్నారు. ఫలితంగా జిల్లాలోని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వానకాలం పంటకైనా సీజన్‌కు ముందుగా పెట్టుబడి సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు కొనుగోలుకు అవసరమైన రైతుభరోసా సాయాన్ని జూన్‌లోనే అందించాలన్నారు. జూలైలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రైతులతో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చి ముట్టడిస్తామని హెచ్చరించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గతంలో సీఎం కేసీఆర్‌తో మాట్లాడి గోదావరి జలాలను తెచ్చిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక నీళ్లు ఇయ్యలేక పంటలను ఎండబెట్టిందన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కాలం గడపడం కాదని పాలనపై దృష్టిపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని హెచ్చరించారు. ఆయన వెంట ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు ఉన్నారు.

ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డి

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

టేకులపల్లి, మే 24 : సమస్యలపై ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ గ్రాడ్యుయేట్లకు విజ్ఞప్తి చేశారు. రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం సులానగర్, బిల్లుడుతండా, కొండంగలబోడు, మద్రాస్‌తండా తదితర గ్రామాల్లో సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌గౌడ్‌లతో కలిసి ఆమె విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలంటే రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు జర్పుల లచ్చనాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

పట్టభద్రులు ఆలోచించి ఓటెయ్యండి

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ప్రచారం నిర్వహిస్తున్న మెచ్చా

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్, మే 24 : పట్టభద్రులు ఆలోచించి విద్యావంతుడైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఒక్కసారి ఓటేసినందుకే రాష్ట్రాన్ని కాంగ్రెసోళ్ళు ఆగం చేస్తున్నారని, మళ్లీ వారికి అవకాశం ఇవ్వొద్దన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్‌తోపాటు పలు ప్రాంతాల్లోఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడ పాలన సాగిస్తోందని, ప్రశ్నించిన వారిపై నాయకులు దాడులకు ఎగబడుతూ అక్రమ కేసులు బయిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన నిజాయితీపరుడు, సౌమ్యుడైన రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను వేడుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, నాయకులు రాజమోహన్‌రెడ్డి, సంకా ప్రసాద్, ఎస్.సంపూర్ణ, తాడేపల్లి రవి,బుక్కూరి బుచ్చిబాబు, నందికోల వెంకన్న, చరణ్, సూరి, మోహన్, రాంబాబు పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డికి పట్టం కట్టండి

మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి వనమా

పాల్వంచ, మే 24 : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న విద్యావంతుడు, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు గ్రాడ్యుయేటర్లను కోరారు. శుక్రవారం పాల్వంచలోని కో ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వనమా పాల్గొన్నారు. పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ప్రజా సేవ చేయడానికి వచ్చిన రాకేశ్‌రెడ్డికి కేసీఆర్ ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చారని, ఆయనను గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తారన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, కాల్వ ప్రభాకర్‌రావు, మంతపురి రాజుగౌడ్, ముచ్చర్ల రమణమూర్తి నాయుడు, బి.మధుచంద్, రేగడి మధు, ఎన్. శ్రీను, కె.హర్షవర్ధన్, సమ్మయ్య గౌడ్, రంజిత్, ఎం.కిరణ్ పాల్గొన్నారు.